# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :20 | 04-08- 2026 | మంగళవారం | పేజీలు: 4 | వెల:03/-



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో





## నిర్మల్ జిల్లాకు భారీగా సబ్సిడీలు.. ఆయిల్ పామ్, సూక్ష్మ సాగుకు ప్రాధాన్యం!

నిర్మల్ ఆగష్టు 3 తెలంగాణ వెన్నెల వాక్కు

వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. సంప్రదాయ వరి సాగు నుంచి అధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల వైపు రైతు సోదరులను మళ్లించడమే ప్రధాన ధ్యేయంగా జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్మల్ జిల్లా పరిధిలో వివిధ అభివృద్ధి పథకాల కింద రైతులకు భారీగా సబ్సిడీలను అందించేందుకు ప్రణాళికలను ఖరారు చేశారు. పండ్ల తోటల పెంపకం, ఆయిల్ పామ్, సూక్ష్మ నీటిపారుదల, తీగజాతి కూరగాయల సాగుతో పాటు పట్టు పరిశ్రమ విస్తరణకు బహుళ ప్రోత్సాహకాలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

**విస్తృతంగా ఆయిల్ పామ్ తోటల సాగు..**

దేశంలో వంటనూనెల దిగుమతి భారాన్ని తగ్గించడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన, శాశ్వత ఆదాయాన్ని అందించే లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును జిల్లాలో ప్రాధాన్యత రంగాలుగా చేపట్టారు. గత నాలుగు సంవత్సరాలుగా (2022-23 నుండి 2025-26 వరకు) జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,524 మంది రైతులు 8,751.72 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి మంచి ఫలితాలను సాధించారు. ఈ వరుస ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్తూ, ఈ ఆర్థిక సంవత్సరంలో నూతనంగా మరో 1,600 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని నిర్దేశించుకున్నారు. ఇందులో సాధారణ కేటగిరీ రైతులకు 1,208 ఎకరాలు, ఎస్సీ రైతులకు 247 ఎకరాలు, ఎస్టీ రైతులకు 145 ఎకరాల విస్తీర్ణాన్ని ప్రత్యేకంగా కేటాయిస్తూ రాయితీలు కల్పిస్తున్నారు.

**సూక్ష్మ సేద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత..**

లభ్యతలో ఉన్న సాగునీటిని ఆదా చేస్తూ, పంటలకు ఎరువుల సమర్థ వినియోగానికి తోడ్పడే తెలంగాణ సూక్ష్మ సేద్య ప్రాజెక్టు (౦+వీ౫ూ) కింద డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల మంజూరుకు పెద్దపీట వేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.710 లక్షల అంచనా వ్యయంతో మొత్తం 3,387 ఎకరాల్లో సూక్ష్మ సేద్య పరికరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఆయిల్ పామ్ తోటల కోసం 2,633 ఎకరాలకు గాను రూ.503 లక్షలు, సాధారణ పంటలకు డ్రిప్ కోసం 303 ఎకరాలకు గాను రూ.136 లక్షలు, అలాగే తుంపర్ల (స్ప్రింక్లర్) సేద్యం కోసం 452 ఎకరాలకు గాను రూ.71 లక్షలను కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు ఏకంగా 90 శాతం సబ్సిడీ లభిస్తుండగా, చిన్న మరియు సన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. కుటుంబానికి గరిష్టంగా 12.5 ఎకరాల వరకు ఈ సబ్సిడీని పొందే అవకాశం ఉంటుంది.

**పండ్ల తోటలు, పందిరి సాగుకు ఊతం..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు జరుగుతున్న ఉద్యానవన సమగ్ర అభివృద్ధి మిషన్ (వీ×ణఎ) ద్వారా రూ.120.27 లక్షలతో 567.16 హెక్టార్లలో వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయలు, ఉల్లిపాయలు, దుంప మరియు సుగంధ ద్రవ్య పంటల విస్తరణకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం సబ్సిడీతో రూ.50,000 వరకు సాయం అందిస్తున్నారు. పొలం గట్ల వెంట వెదురు సాగుకు జాతీయ వెదురు మిషన్ కింద ఎకరానికి రూ.24,000 ప్రోత్సాహకం ఇస్తుండగా, మల్బరీ తోటలు, పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి పట్టు పరిశ్రమ శాఖ ద్వారా రూ.2.85 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తున్నారు.

**రైతాంగం సద్వినియోగం చేసుకోవాలి:**

జిల్లాలో వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు లభిస్తున్న ఈ సబ్సిడీ పథకాలను నిర్మల్ జిల్లాలోని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. తమ భూముల స్వభావం, నీటి వసతికి అనుకూలమైన పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు వివరాలతో స్థానిక మండల ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచిస్తున్నారు.

## బీహార్‌లో జన్‌సురాజ్‌కు తొలి విజయం:

### బంకీపూర్ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం!



పాట్నా బ్యూరో

బీహార్ రాజకీయాల్లో ఊహించని సంచలనం నమోదైంది. రాష్ట్రాన్ని దశాబ్దాలుగా ఏలుతున్న సాంప్రదాయ రాజకీయ సమీకరణాలను తలకిందులు చేస్తూ జన్‌సురాజ్ పార్టీ తన తొలి బోణీ కొట్టింది. అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ చారిత్రాత్మక విజయం సాధించారు. బలమైన అధికార బీజేపీ-జేడీయూ కూటమి అభ్యర్థి నీరజ్ సిన్హాను భారీ ఆధిక్యంతో ఓడించి, బీహార్ అసెంబ్లీలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. ఈ విజయంతో బీహార్ రాజకీయ యవనికపై ఒక కొత్త రాజకీయ శకానికి నాంది పడినట్లయింది.

సంచలనంగా మారిన ఉప ఎన్నికల ఫలితం

పాట్నా జిల్లా పరిధిలోకి వచ్చే అత్యంత కీలకమైన బంకీపూర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీహార్‌తో పాటు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేశాయి. మొదటి రౌండ్ లెక్కింపు నుంచే జన్‌సురాజ్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. బీజేపీకి బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పట్టణ ప్రాంతాల్లో కూడా జన్‌సురాజ్ వైపే ఓటర్లు మొగ్గు చూపడం విశేషం. హోరాహోరీగా సాగిన ఓట్ల లెక్కింపు ముగిసేసరికి ప్రశాంత్ కిషోర్ సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై గణనీయమైన మెజారిటీతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. శతాబ్ద కాలంగా సాగుతున్న

2

## 20వేల పోస్టులుంటే.. 7 వేలకే నోటిఫికేషన్ ఇస్తారా?:

### కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం!



హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిపై భారత రాష్ట్రీయ సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో దాదాపు 20 వేలకు పైగా పోలీస్ ఖాళీలు స్పష్టంగా కనిపిస్తుంటే, ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేయడమేనని విమర్శించారు.

**నిరుద్యోగులపై నిర్లక్ష్యం సమంజసం కాదు**

ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే వేలాది ఖాళీలను భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కి నామమాత్రపు నోటిఫికేషన్లతో సరిపెడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు ఏళ్లకు ఏళ్లుగా కోచింగ్ సెంటర్లలో కష్టపడి చదువుకుంటూ ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారని, కానీ ప్రభుత్వ అరకొర నోటిఫికేషన్లు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ ఇవ్వకుండా సగం కంటే తక్కువ పోస్టులను భర్తీ చేయడం వల్ల వేలాది మంది అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం**

హామీల ప్రకారం తమకు రావాల్సిన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్లెక్కి నిరసన తెలుపుతున్న నిరుద్యోగ యువత పట్ల ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. హక్కుల సాధన కోసం బరిగీసి పోరాడుతున్న యువతను ఆదుకోవాల్సింది పోయి, ఉద్యోగాలు అడిగితే "ఎండ్రిన్ తాగి చావాలి" అంటూ స్వయంగా ముఖ్యమంత్రే విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించడం దారుణమని ధ్వజమెత్తారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నిరుద్యోగుల ఆక్రోశాన్ని అర్థం చేసుకోకుండా, వారిని

2

## నా పట్ల అహంకారం ఎక్కువైంది.. తగ్గించుకోండి":

### 6 నెలల్లో విగ్రహ ప్రతిష్ఠ జరక్కపోతే నేనేంటో చూస్తారు.. మాతంగి స్వర్ణలత పలికిన భవిష్యవాణి ఇదే!

సికింద్రాబాద్ బ్యూరో

ప్రసిద్ధ సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతర ముగింపు ఘట్టంలో భాగంగా అత్యంత భక్తిశ్రద్ధల నడుమ, వేలాది మంది భక్తుల ఉత్కంఠ మధ్య నిర్వహించే విలక్షణమైన "భవిష్యవాణి" (రంగం) కార్యక్రమం ముగిసింది. అమ్మవారి శక్తిరూపంగా భావించే మాతంగి స్వర్ణలత పచ్చిమట్టి కుండపై నిలబడి భవిష్యవాణి వినిపిస్తూ, ఈసారి తీవ్రమైన ఆగ్రహాన్ని, భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. భక్తులతో పాటు ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడిన ఆమె, "నా పట్ల మీలో అహంకారం ఎక్కువైంది.. వెంటనే దానిని తగ్గించుకోండి" అంటూ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.



బోనాల ఉత్సవాల మరుసటి రోజున తెల్లవారుజామున నిర్వహించే ఈ సాంప్రదాయ రంగం కార్యక్రమంలో స్వర్ణలత పూనకంతో ఊగిపోతూ భవిష్యత్తు పరిణామాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అమ్మవారి స్వరూపంగా ఆమె మాట్లాడుతూ, తనను ఆరాధించే విధానంలోనూ, పూజా పునస్కారాల నిర్వహణలోనూ మానవులలో భక్తిశ్రద్ధలు తగ్గి అహంకారం, నిర్లక్ష్యం పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతగా కరుణించి కాపాడుతున్నప్పటికీ మనుషులకు స్వార్థం, గర్వం పెరుగుతోందని, ఈ వైఖరిని సరిదిద్దుకోకపోతే రాబోయే రోజుల్లో కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అంతేకాకుండా, గతంలో అధికారులు మరియు ఆలయ ప్రతినిధులు ఇచ్చిన హామీల అమలుపై అమ్మవారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో లేదా నిర్దేశిత ప్రాంతంలో విగ్రహ ప్రతిష్ఠాపన ప్రక్రియ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మండిపడ్డారు. "రాబోయే ఆరు నెలల కాలంలోగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేయకపోతే నా ప్రతాపం ఏంటో, నేనేంటో స్పష్టంగా చూపిస్తాను" అంటూ మాతంగి స్వర్ణలత పలికిన హెచ్చరిక సభలో ఉన్న ప్రతి ఒక్కరినీ భయాందోళనలకు

2

# చింతకుంట చెరువులో పడి యువకుడి మృతి: ముధోల్ మండలంలో శోకసంద్రం



ముధోల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన అర్షాల బాబు (18) అనే యువకుడు సోమవారం ప్రమాదవశాత్తు గ్రామ చెరువులో పడి మృతి చెందాడు. ప్రమాదకర రీతిలో నీటిలో మునిగి యువకుడు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది.
మధ్యాహ్నం చెరువు ఒడ్డున అర్షాల బాబు చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు, స్థానిక గ్రామస్తులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత నీటిలో మునిగిపోయిన మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముధోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# శాంతినగర్‌లో విద్యా వికాస కేంద్రం ప్రారంభోత్సవం: ఏకలవ్య ఫౌండేషన్ చొరవ



నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వాసవి ఎడ్యుకేషన్ ఇన్నోవేటివ్ ట్రస్ట్ సహ కారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ స్లమ్ ఏరియా ప్రభుత్వ పాఠశాలలో "విద్యా వికాస కేంద్రాన్ని" సోమ వారం ఘనంగా ప్రారంభించారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు సాయంత్రం వేళల్లో ఉచితంగా ట్యూషన్ సెంటర్లు నిర్వహించేందుకు ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.
కార్యక్రమంలో వాసవి ట్రస్ట్ ప్రతినిధి ముత్యం రెడ్డి మాట్లాడుతూ, మురికివాడల్లోని పేద పిల్లలను చదువులో ముందుకు తీసుకెళ్లేందుకు ట్యూషన్ సెంటర్లు ఎంతో ఉపయో గపడతాయన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు మెంబర్ రాజులవార్ దిగంబర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలోని 10 స్లమ్ ఏరియాలలో విద్యా వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఫౌండేషన్ మేనేజర్ ప్రశాంత్, కోఆర్డినేటర్ చిన్నయ్య, ట్యూటర్లు ఆశాజ్యోతి, నవిత, పోషకులు పాల్గొన్నారు.

# బీహార్‌లో జన్‌సురాజ్‌కు తొలి విజయం:

ప్రాంతీయ, కుల రాజకీయాలకు భిన్నంగా మార్పు కోరుకునే ఓటర్లు జన్‌సురాజ్ వైపు నిలిచారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి.
పాదయాత్రకు లభించిన ప్రజామోదం
బీహార్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని నిర్మించడమే లక్ష్యంగా ప్రశాంత్ కిషోర్ గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన "జన్‌సురాజ్ పాదయాత్ర"కు ఈ విజయం లభించిన గొప్ప గుర్తింపుగా విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యటిస్తూ విద్య, ఉపాధి, అభివృద్ధి, సుపరిపాలన ప్రాతిపదికన ఆయన నిర్వహించిన ప్రచారం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్జేడీ, జేడీయూ, బీజేపీల సాంప్రదాయ ఓటు బ్యాంకులను దాటుకుని సామాన్య ప్రజలు, యువత, మహిళలు జన్‌సురాజ్ అభ్యర్థికి పట్టంగట్టడం బీహార్‌లోని కొత్త ఆలోచనా విధానానికి నిదర్శనంగా నిలుస్తోంది.
రాజకీయాల్లో మారనున్న సమీకరణాలు
బంకీపూర్ నియోజకవర్గంలో సాధించిన ఈ విజయం బీహార్ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపనుంది. ఇప్పటివరకు నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి, లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ నాయకత్వంలోని మహాగట్‌బంధన్‌కు మాత్రమే పరిమితమైన బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు 'జన్‌సురాజ్' మూడో బలమైన శక్తిగా ఆవిర్భవించింది. రాబోయే సాధారణ అసెంబ్లీ ఎన్నికల నాటికి ఈ విజయం జన్‌సురాజ్ శ్రేణుల్లో కొండంత ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, అధికార, ప్రతిపక్ష కూటములకు తీవ్రమైన రాజకీయ హెచ్చరికగా మారింది.
కొత్త చరిత్రకు శ్రీకారం
విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ, ఈ విజయం తనది కాదని, మార్పును ఆకాంక్షించిన బంకీపూర్ ప్రజల విజయమని ప్రకటించారు. బీహార్‌ను వెనుకబాటుతనం, నిరుద్యోగం నుంచి రక్షించి అభివృద్ధి పథంలో నడిపించడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ తొలి అడుగు రాబోయే రోజుల్లో సమగ్ర బీహార్ మార్పునకు పునాది అని ఆయన ఉద్ఘాటించారు. జన్‌సురాజ్ సాధించిన ఈ తొలి విజయం రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా రాజకీయ చైతన్యాన్ని రగిలిస్తుందనడంలో సందేహం లేదు.

# 20వేల పోస్టులుంటే.. 7 వేలకే నోటిఫికేషన్ ఇస్తారా?:



అవమానించేలా మాట్లాడటం ఆయన నైజానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
పూర్తిస్థాయి ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి
ప్రభుత్వం ఇకనైనా కంటితుడుపు చర్యలు స్వస్తి చెప్పి, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న మొత్తం 20 వేల ఉద్యోగాలకు తక్షణమే అనుబంధ నోటిఫికేషన్ (యాడ్-ఆన్ నోటిఫికేషన్) విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపకపోతే బీఆర్ఎస్ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఆగ్రహం తప్పదని హెచ్చరించారు.

# హక్కుల కాళరాత్రిలో సంబరం సాధ్యమేనా?

## 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'పై ప్రత్యేక విశ్లేషణ

తరతరాలుగా అడవినే నమ్ముకుని, ప్రకృతిని పూజిస్తూ, పర్యావరణాన్ని ప్రాణప్రదంగా కాపాడుకుంటూ జీవిస్తున్న ఆదివాసీల రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టబద్ధమైన రక్షణలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రస్థాయిలో దాడి చేస్తున్నాయని గిరిజన సమాజం మండిపడుతోంది. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఆదివాసీల ఉనికికే ముప్పు తెచ్చేలా నిర్ణయాలు తీసుకుంటూ, వారిని సొంత నేలల నుంచే వెళ్లగొట్టేలా కుట్రలు సాగుతున్నాయన్న ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒకవైపు అటవీ అధికారుల నిరంకుశ దౌర్జన్యాలు, లాఠీఛార్జీలు, మహిళలపై వేధింపులు, అక్రమ కేసులు నిత్యకృత్యంగా మారాయి. మరోవైపు దశాబ్దాలుగా రక్షణగా నిలిచిన చట్టాల రద్దుతో మన్యం ప్రాంతం కొండంత ఆవేదనతో అట్టుడుకుతోంది. ఈ తీవ్రమైన భయాందోళనలు, హక్కుల భంగం నడుమ ఆదివాసీల హక్కులను చట్టబద్ధంగా కాపాడకుండా, ప్రతి ఏటా ఆగస్టు 9న వచ్చే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఏ రకంగా వేడుకగా జరుపుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తూ గిరిజన మేధావులు, వివిధ గిరిజన సంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు ఆదివాసీల జీవితాలను తీవ్ర అల్లకల్లోలానికి గురిచేస్తున్నాయి.
2006 నాటి అటవీ హక్కుల చట్టం (ఖీ=ూా) ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీలకు చట్టబద్ధమైన పోడు పట్టాలు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. భూమిపై హక్కు పత్రాలు ఇవ్వకపోగా, తమ సొంత భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం ప్రదర్శిస్తున్నారు. తమ పండించిన పంటలను ధ్వంసం చేయడం, ఎదిరించిన ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు భౌతిక దాడులు, లాఠీఛార్జీలు చేస్తూ వారిపై అక్రమ



కేసులు బనాయించి జైళ్లకు పంపడం మన్యంలో నిత్యకృత్యంగా మారింది. అటవీ సరిహద్దుల్లో, గిరిజన గూడేలలో ఆదివాసీ మహిళలపై అధికారుల అరాచకాలు, అక్రమాలు హద్దులు దాటుతున్నప్పటికీ, నిందితులైన అధికారులపై ప్రభుత్వాలు ఎలాంటి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరం. అడవిలో విధి నిర్వహణ పేరుతో సాగుతున్న ఈ అక్రమ నిర్బంధాలు, వేధింపులు ఆదివాసీలను తమ నివాస ప్రాంతాల్లోనే భయంతో బతికేలా చేస్తున్నాయి.
ఆదివాసీల విద్యా, ఉద్యోగ, భూ హక్కులకు కొండంత అండగా నిలిచిన చట్టపరమైన రక్షణలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్న తీరు గిరిజన యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టివేస్తోంది. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ద్వారా లభించిన అధికారాల ఆధారంగా తెచ్చిన జీవో నంబరు 3ను రద్దు చేయడంతో, ఏజెన్సీ ప్రాంతాల్లోని వంద శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలను స్థానిక గిరిజనులే పొందే అవకాశం కోల్పోయారు. దీనివల్ల ఆదివాసీ యువత ఉపాధి అవకాశాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ జీవోకు ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ఉద్యోగాల్లో గిరిజనులకే వంద శాతం రిజర్వేషన్లు కల్పించే నూతన చట్టాన్ని లేదా జీవోను తక్షణమే తేవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అలాగే ఏజెన్సీ భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడే చారిత్రాత్మక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదిలీ నియంత్రణ చట్టం (1/70 చట్టం) ఆదివాసీల గుండెకాయ లాంటిది. అయితే సుప్రీంకోర్టులో ఈ చట్టాన్ని రక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన వాదనలు వినిపించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగిస్తూ స్థానిక గిరిజన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల సంస్కృతి, భాష, ఉనికిని గుర్తించేందుకు ప్రతి ఏటా ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా, అసలైన చట్టబద్ధ హక్కులను హరిస్తూ పాలకులు కేవలం పండుగ వాతావరణం సృష్టిస్తే సరిపోదని గిరిజన లోకం స్పష్టం చేస్తోంది. అడవిలో బతుకుతున్న ఆదివాసీలపై రోజువారీ లాఠీఛార్జీలు, అక్రమ కేసులు పెడుతూ భయాందోళనల్లో ఉంచితే ఏ ముఖం పెట్టుకుని ఆదివాసీలు ఆనందంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి. కేవలం వేదికలపై సభలు, సమావేశాలు, ప్రభుత్వ ప్రకటనలకే ఈ వేడుకలను పరిమితం చేయకుండా, 2006 అటవీ హక్కుల చట్టం కింద ఆదివాసీలకు చట్టబద్ధమైన పోడు పట్టాలను ఇచ్చి, ఐదో షెడ్యూల్ స్ఫూర్తితో విద్యా-ఉద్యోగాల్లో వంద శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరించినప్పుడే ఆదివాసీ దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. హక్కుల సాధన జరగకుండా చేసే వేడుకలు కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమే అవుతాయి.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ నిరంకుశ వైఖరిని, గిరిజన వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే చట్టబద్ధమైన పట్టాలు మంజూరు చేయడంతో పాటు, ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించిన అటవీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. జీవో నంబరు 3 పునరుద్ధరణకు, 1/70 చట్ట పరిరక్షణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చట్టపరమైన పోరాటం చేయాలి. రాజ్యాంగం తమకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, అడవి భూమిని, భవిష్యత్ తరాల బతుకులను కాపాడుకోవడానికి ఆదివాసీలు, గిరిజన సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై పాలకుల వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది. పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఆదివాసీలు తమ చైతన్యాన్ని చాటుకోవడమే ఈనాటి ప్రధాన కార్యాచరణ.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# నా పట్ల అహంకారం ఎక్కువైంది.. తగ్గించుకోండి":

గురిచేసింది. పూజలు, సమర్పణలు కేవలం ప్రదర్శనగా మారకూడదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే నిజమైన భక్తి అని స్పష్టం చేశారు.
ఈ భవిష్యవాణి వినిపించే క్రమంలో మాతంగి స్వర్ణలత తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. పూనకంలో ఉన్న ఆమె కంటివెంట కన్నీళ్లు కారడం చూసి అక్కడున్న వేలాది మంది భక్తులు, ఆలయ అర్చకులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రజాక్షేమాన్ని కోరుతూ, రాష్ట్రాన్ని కరువు కాటకాల నుంచి కాపాడాలని, సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలు పండేలా దీవించాలని అర్చకులు, భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. దానికి స్పందించిన అమ్మవారు, మానవులు తమ తప్పులను తెలుసుకుని, అహంకారాన్ని వీడి నిష్టతో నడుచుకుంటే రాష్ట్రాన్ని, ప్రజలను చల్లగా చూస్తానని అభయమిచ్చారు. తగిన సమయంలో వర్షాలు కురిపించి ప్రజలకు శాంతిసౌఖ్యాలు కలిగిస్తానని చెప్పారు.
సికింద్రాబాద్ మహంకాళి బోనాల పండగ చివరి రోజున జరిగే ఈ భవిష్యవాణి కార్యక్రమాన్ని తిలకించేందుకు తెలంగాణ నలుమూలల నుంచి విపరీతమైన సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మాతంగి స్వర్ణలత పలికిన ఆధ్యాత్మిక హెచ్చరికలు, ఆరు నెలల గడువుతో కూడిన భవిష్యవాణి ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. అమ్మవారి ఆగ్రహానికి గురికాకుండా అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతిష్ఠాపన పనులను పూర్తి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 38కి పెంపు:

## లోక్‌సభలో కీలక బిల్లు ఆమోదం.. పెండింగ్ కేసులకు ఎట్టకేలకు చెక్!

న్యూఢిల్లీ బ్యూరో
దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో రాజ్యాంగబద్ధమైన తీర్పుల వేగం పెంచడంతో పాటు లక్షలాదిగా పేరుకుపోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనుమతించబడిన సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు, 2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టంగా మారిన తర్వాత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతమున్న 34 నుంచి 38కి పెరగనుంది.
సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయశాఖ మంత్రి
కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఈ కీలక సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది మే నెలలో అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ నూతన బిల్లును సభ ముందుకు తీసుకురాగా, సభలో చర్చ అనంతరం దిగువ సభ దీనిని ధ్వనిఓటుతో ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశ ప్రజలకు వేగవంతమైన, సులభతరమైన న్యాయాన్ని అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం ద్వారానే విచారణల్లో జాప్యాన్ని నివారించవచ్చని తెలిపారు.
పెండింగ్ కేసుల నివారణకు ఏకైక మార్గం
ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టులో దాదాపు 92,000కు పైగా వివిధ రకాల కేసులు విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతీ ఏటా నమోదవుతున్న కొత్త కేసుల సంఖ్య, కోర్టు పరిష్కరిస్తున్న కేసుల కంటే ఎక్కువగా ఉండటంతో అత్యున్నత న్యాయస్థానంపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా సీనియర్ న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాలు ముఖ్యమైన కేసులపై విచారణ చేపట్టిన సమయంలో సాధారణ అపీళ్లు, సివిల్, క్రిమినల్ కేసుల విచారణ మందగిస్తోందనే అభిప్రాయం ఉంది. న్యాయమూర్తుల సంఖ్య 38కి పెరగడం వల్ల అదనపు ధర్మాసనాలను ఏర్పాటు చేసి, కొన్ని ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని కేసులను త్వరితగతిన తేల్చడానికి వీలు కలుగుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.
2019 తర్వాత మళ్లీ ఇప్పుడే..
సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం 2019 సంవత్సరం తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1950లో సుప్రీంకోర్టు ప్రారంభమైనప్పుడు ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య కేవలం 8గా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కేసుల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా 1956, 1960, 1978, 1986, 2009 మరియు 2019లలో క్రమంగా పెంచుకుంటూ వచ్చారు. 2019లో న్యాయమూర్తుల సంఖ్యను 31 నుంచి 34కి పెంచగా, ఇప్పుడు తాజాగా మరో నలుగురు న్యాయమూర్తుల నియామకానికి మార్గం సుగమమైంది.
నూతనంగా పెరిగే ఈ నాలుగు ఖాళీల భర్తీతో సుప్రీంకోర్టు పాత కేసుల పరిష్కార వేగాన్ని పుంజుకోవడమే కాకుండా, సామాన్య ప్రజలకు అత్యున్నత స్థాయి న్యాయం త్వరగా అందుబాటులోకి వస్తుందని చట్టసభ సభ్యులు, ప్రముఖ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ముధోల్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు: సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్

ముధోల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామానికి చెందిన చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాస కార్యక్రమాలను జరిపించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు పసిపాపలకు మొదటి రోగనిరోధక టీకా వంటివని, పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో రాజశ్రీ, వార్డు సభ్యులు విశ్వంబర్, ఏఎన్ఎం విజయ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# కౌట మాజీ సర్పంచ్ బాబూరావు పటేల్ కుటుంబాన్ని పరామర్శించిన వేణుగోపాలాచారి

బాసర, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర మండలం కౌట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ బాబూరావు పటేల్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి సోమవారం కౌట గ్రామానికి వెళ్లి బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు.
మరణించిన బాబూరావు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాబూరావు సేవలను కొనియాడారు. పరామర్శించిన వారిలో ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ కొట్టే హన్మల్లు, ధర్మగౌడ్, రావుల గంగారెడ్డి తదితరులు ఉన్నారు.



# కుబీర్ బడుల్లో అక్రమాలపై కలెక్టర్‌కు సీవైఎస్ఎస్ ఫిర్యాదు

నిర్మల్/కుబీర్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కుబీర్ మండలంలోని అంతర్ని, కుప్టి ప్రభుత్వ పాఠశాలల్లో విధులకు హాజరుకాకుండా వేతనాలు పొందుతున్న ఉపాధ్యాయులపై, బడి నిధులను పక్కదారి పట్టిస్తున్న వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని చాత్ర యువ సంఘర్షణ సమితి (సీవైఎస్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్,



యుఎస్ఎఫ్ఐ కార్యదర్శి నవీన్ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలలకు మంజూరయ్యే గ్రాంట్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా సీఆర్పీలు, ఎంఐఎస్ సిబ్బంది ఖాతా లకు మళ్లిం చడంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బా ధ్యులపై విచారణ జరిపి పేద విద్యా ర్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చ రించారు.

# మోహన్ రావు పాటిల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ కోచింగ్ ప్రారంభం

భైంసా, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నియామకాల నోటిఫికేషన్‌ను పురస్కరించుకుని భైంసా పట్టణంలోని మోహన్ రావు పాటిల్ స్టడీ సర్కిల్‌లో ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్, ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ కృష్ణదాస్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు.




ఈ సందర్భంగా మోహన్ రావు పాటిల్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఎలాంటి పుకార్లను నమ్మకుండా స్వయంకృషితో చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. ప్రతి అభ్యర్థి విజయమే ట్రస్ట్ లక్ష్యమని, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు దిగంబర్, దామోదర్, కౌన్సిలర్ దిలీప్, అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచుల ఫోరం జిల్లా కార్యదర్శిగా జాదవ్ అంబర్‌సింగ్ నాయక్

ముధోల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలం ఎడ్బీడ్ తండా ఉపసర్పంచ్ జాదవ్ అంబర్‌సింగ్ నాయక్ తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం నిర్మల్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫోరం రాష్ట్ర నాయకత్వం ఆమోదంతో అంబర్‌సింగ్ ను జిల్లా కార్యదర్శిగా నియమిస్తున్నట్లు



జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సంపత్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.
తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్, జిల్లా నాయకత్వానికి అంబర్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచుల హక్కుల సాధనకు, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, గ్రామీణ ప్రాంతాల్లో ఫోరం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మామడ పోతారం హత్య కేసును 12 గంటల్లో ఛేదించిన పోలీసులు!

- భూ వివాదంలో కత్తితో దాడి చేసి తమ్ముడిని దారుణంగా నరికి చంపిన అన్న
- ప్రత్యేక బృందాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసు యంత్రాంగం
- వేగంగా స్పందించిన సోన్ సీఐ, మామడ, లక్ష్మణచాందా ఎస్ఐలను అభినందించిన ఎస్పీ

మామడ/నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మామడ మండలం పోతారం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న సంచలనాత్మక హత్య కేసును నిర్మల్ జిల్లా పోలీసులు కేవలం 12 గంటల వ్యవధిలోనే విజయవంతంగా ఛేదించారు. భూ వివాదాల నేపథ్యంలో సొంత తమ్ముడిని కత్తితో దారుణంగా నరికి చంపిన నిందితుడిని ప్రత్యేక పోలీసు బృందాలు వేగంగా స్పందించి అదుపులోకి తీసుకున్నాయి. నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో చేపట్టిన దర్యాప్తు వివరాలను అధికారులు వెల్లడించారు.




**భూ వివాదమే హత్యకు దారితీసింది:**
పోతారం గ్రామానికి చెందిన పెద్దోళ్ల బావన్న (50), అతని తమ్ముడు పెద్దోళ్ల లింబాద్రి (45) మధ్య గత కొంతకాలంగా ఉమ్మడి వ్యవసాయ భూమికి సంబంధించి గట్టు, బోరుబావి, దారి విషయమై తీవ్ర వివాదాలు జరుగుతున్నాయి. గతంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ కక్ష పెంచుకున్న పెద్దోళ్ల బావన్న, ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో లింబాద్రి ఒంటరిగా ఇంటికి వెళ్తుండగా కత్తితో దాడి చేశాడు. దాడిని అడ్డుకోవడానికి యత్నించిన బంధువు నైని రాధకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లింబాద్రిని నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

**12 గంటల్లో నిందితుడి అరెస్ట్:**
ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, మామడ, లక్ష్మణచాందా ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు బావన్నను 12 గంటల్లోనే అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వేగంగా కేసును ఛేదించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ముధోల్ ఎంపీపీ ఆఫీస్‌లో మండల సర్వసభ్య సమావేశం

ముధోల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ముధోల్ ఎంపీడీఓ లవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ ఉమ్మడి అధ్యక్షతన జరగనుంది.
సమావేశంలో మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, శాఖల వారీ ప్రగతి నివేదికలు, రాబోయే ప్రణాళికలపై సుదీర్ఘంగా సమీక్షిస్తామన్నారు. మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సమయపాలన పాటిస్తూ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

# రోళ్ల రమేష్‌ను పరామర్శించిన నాయకులు డాక్టర్ కిరణ్ కొమ్రేవాడ్

భైంసా/ముధోల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఇటీవల తీవ్ర గుండెపోటుతో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో శస్త్రచికిత్స పొంది డిశ్చార్జ్ అయిన ముధోల్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేష్‌ను ముధోల్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ కిరణ్ కొమ్రేవాడ్, ఎన్నెల అనిల్, గోరెకర్ బాబు సోమవారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో పరామర్శించారు.
రమేష్ ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవలను ఆయన కుమారుడు మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. రమేష్ చావుగండం నుండి బయటపడి వేగంగా కోలుకోవడం సంతోషకరమని, త్వరలోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో బి. గణేష్ ఉన్నారు.



# ఇందన్‌పల్లి ఆదివాసులపై అటవీ అధికారుల జులుం: తుడుం దెబ్బ హెచ్చరిక!

- ఎఫ్ఆర్ఓను 24 గంటల్లో సస్పెండ్ చేయాలి: తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంక గారి భూమయ్య
- ఆగస్టు 9 లోగా వైల్డ్‌లైఫ్ అధికారి శాంత్‌రామ్‌పై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న నిరుపేద ఆదివాసులపై అటవీ శాఖ అధికారుల దాష్టీకం మితిమీరుతోందని, వారి జులుంను ఇక ఎంతమాత్రం సహించేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంక గారి భూమయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా ఇందన్‌పల్లి పరిధిలో అమాయక గిరిజనులపై అటవీ శాఖ అధికారులు కక్షకట్టి భౌతిక దాడికి దిగడాన్ని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో తమ హక్కుల కోసం పోరాడుతున్న అడవి బిడ్డల గొంతు నొక్కాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

**24 గంటల్లో ఎఫ్ఆర్ఓను సస్పెండ్ చేయాలి:**




ఇందన్‌పల్లి ఘటనలో ఆదివాసులపై నేరుగా భౌతిక దాడికి దిగిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌ను (ఎఫ్ఆర్ఓ) రాబోయే 24 గంటల వ్యవధిలోనే తక్షణమే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని, అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం దాడి వెనుక టైగర్ జోన్, వన్యప్రాణి విభాగం అధికారి (ఎఫ్‌డీపీ) శాంత్‌రామ్ పాత్ర ఉందని ఆరోపించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవమైన ఆగస్టు 9 నాటికి శాంత్‌రామ్‌ను ఈ ప్రాంతం నుండి బదిలీ చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ సంఘాలు, గిరిజన మేధావులను ఏకం చేసి సకల జనుల మహా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నిర్మల్ బాగులవాడలో విజయవంతంగా 31 కోతుల పట్టివేత

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని 30వ వార్డు బాగులవాడ భూలక్ష్మి ఆలయ పరిసర ప్రాంతాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం సోమవారం విజయవంతంగా ముగిసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పర్యవేక్షణలో స్పెషల్ టీమ్ ద్వారా 31 కోతులను సురక్షితంగా పట్టుకున్నారు.
పట్టుబడిన కోతులకు రంగులు చల్లి అటవీ శాఖ అధికారుల సహకారంతో కవ్వాల్ అటవీ ప్రాంతానికి తరలించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించేందుకు అన్ని వార్డుల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ చర్యలు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్పీ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU


# శాఖల సమన్వయంతో జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

- కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గంజాయి, అక్రమ గుట్కా నిర్మూలనపై సమీక్ష
- బడులు, కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై చైతన్యం కల్పించాలి

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిలతో కలిసి పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, అటవీ, విద్యా శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గంజాయి సాగు, నిల్వ, రవాణాను ఏ రూపంలోనూ ఉపేక్షించరాదని, అక్రమ గుట్కా విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.




యువత భవిష్యత్తును కాపాడడం అందరి బాధ్యత: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాపాడటం ప్రతి శాఖ బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో మత్తు పదార్థాల విక్రయంపై పోలీసు శాఖ పటిష్ట నిఘా ఏర్పాటు చేసిందని, నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు నెలకు 18 వేల రూపాయల వేతనం పెంచాలి: సీఐటీయూ

- హామీలు అమలు చేయకపోతే ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరిక
- టీఎన్‌జీఓ భవనంలో ఆశా వర్కర్ల జిల్లా కమిటీ సమావేశం నిర్వహణ

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల హామీ ప్రకారం ఆశా వర్కర్లకు నెలకు 18,000 రూపాయల వేతనం పెంచి ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన ఆశా వర్కర్ల జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ల వల్ల కార్మికులపై పనిభారం పెరిగి, ఉద్యోగ భద్రత లోపిస్తోందని విమర్శించారు.



ఫిక్స్ వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి: తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. గంగామణి మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం అమలు చేస్తుంటే, తెలంగాణలో మాత్రం పారితోషికంతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా సేకరణ (బీఎల్ఓ) డ్యూటీలతో పనిభారం పెంచి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. సుజాత, ఉపాధ్యక్షురాళ్లు విజయ, సుగుణ, ఇంద్రమాల పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక రెవెన్యూ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

- 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశం
- రెవెన్యూ అంశాలు, భూ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుండి వచ్చిన వివిధ భూమి సమస్యల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందింంలో రెవెన్యూ అంశాలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో తహసీల్దార్లు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.




ఇసుక అక్రమ రవాణాపై కఠిన నిఘా: ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రెవెన్యూ దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని, తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలు నమోదు చేయాలన్నారు. భూముల సర్వే, రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్ పాల్గొన్నారు.

# సమాజానికి ఆదర్శంగా రక్తదానం చేసిన కోడె నటరాజ్ శేఖర్

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలానికి చెందిన సామాజిక సేవకుడు కోడె నటరాజ్ శేఖర్ మరోసారి రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. నిర్మల్ పట్టణంలోని లైఫ్ కేర్ బ్లడ్ సెంటర్‌లో సోమవారం ఆయన అత్యవసరంగా అవసరమైన ఏ--నెగెటివ్ రక్తాన్ని దానం చేశారు.

దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి ఏ--నెగెటివ్ రక్తం అత్యవసరంగా అవసరమని సమాచారం అందగానే వెంటనే స్పందించి రక్తదానం చేశారు. అరుదైన రక్తగ్రూప్ అయినప్పటికీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ముందుకు వచ్చి ఓ ప్రాణాన్ని కాపాడేందుకు తన వంతు సహకారం అందించారు.

ఈ సందర్భంగా లైఫ్ కేర్ బ్లడ్ సెంటర్ వైద్య సిబ్బంది, స్థానికులు కోడె నటరాజ్ శేఖర్ సేవాభావాన్ని అభినందించారు. అవసరమైన సమయంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని కోడె నటరాజ్ శేఖర్ పిలుపునిచ్చారు




## హత్యాయత్నం కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మంజులాపూర్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడైన మల్లెపుల రాకేష్‌కు 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు 2,000 రూపాయల జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది.

ఈ కేసులో నాటి ఎస్ఐ చంద్రమోహన్ దర్యాప్తు జరిపి కోర్టులో పక్కా ఆధారాలు ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా శ్రమించిన అధికారులను ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల అభినందించారు.

## ప్రియదర్శినినగర్ చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్‌లో నమోదైన చోరీ కేసులో నిందితుడు కాంబ్లే గణేష్‌కు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. బాధితుడు దుసముడి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నేరాన్ని నిరూపించారు. కేసు విచారించిన ఎస్ఐ అజయ్, సీఐ ప్రవీణ్ కుమార్, ఏపీపీ సతీష్‌లను పోలీసు అధికారులు కొనియాడారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ప్రజల నుండి అందే వినతులను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.


ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా రోజువారీ ముఖ గుర్తింపు (ఫేషియల్ అటెండెన్స్) నమోదు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు బడులు, వసతి గృహాలను తనిఖీ చేసి నివేదికలు అందజేయాలన్నారు.



## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు.

ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకువచ్చేలా రేషనలైజేషన్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. కలెక్టరేట్ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



## బాధితుల ఫిర్యాదులపై పారదర్శకంగా స్పందించాలి: ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని సంబంధిత పీఎస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అనంతరం నిర్మల్ టౌన్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, పెండింగ్ కేసుల విచారణ తీరును పరిశీలించి సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com